ప్రజాశక్తి
గురువారం 6 డిసెంబర్ 2024
5
విజయనగరం



## 8న అండర్ -12 క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న అండర్ -12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి. సీతారామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని విజ్జి క్రికెట్ మైదానంలో జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2012 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డ్, జన్మదిన ధ్రువపత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్, మూడేళ్ల మార్కుల జాబితా తీసుకు రావాలన్నారు. ఎవరైనా నకిలీ ధ్రువపత్రాలు తీసుకొచ్చినట్లు తమ దృష్టికి వస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపికలు నిర్వహించే రోజు ఉదయం 7 గంటలకు వైట్ డ్రెస్ సొంత కిట్టుతో హాజరు కావాలని కోరారు.

# రైతులకు శాపంగా రీసర్వే

- జాయింట్ ఎల్‌పి నెంబర్లతో రైతులకు ఇక్కట్లు
- ఒకరి భూమి మరొకరికి..
- భూ క్రయవిక్రయాలకు ఆటంకాలు
- తప్పుల తడకగా భూ రికార్డులు
- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

**భూ రికార్డులను సరిచేసేందుకు గత వైసిపి ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే రైతులకు శాపంగా మారింది. రీసర్వే జరిగిన అన్ని గ్రామాల్లోనూ భూ రికార్డులు తప్పులు తడకగా మారడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. రీసర్వే తప్పులతో భూముల అమ్మకాలు జరగడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వైద్యానికి, పెళ్లి ఖర్చుల కోసం భూములను అమ్మాలంటే రీసర్వే తప్పులతో అమ్మకాలు జరగడం లేదని రైతులు చెపుతున్నారు. వీటికి తోడు మ్యుటేషన్లు కాకపోవడం, ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి తప్పులను సరి చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం రెవెన్యూ సమస్యలపై గ్రామసభలు పెట్టినప్పటికీ సమస్యలు పరిష్కరించలేదు. తాజాగా శుక్రవారం నుంచి జనవరి 8 వరకు 33 రోజులు పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుండడంతో ఇప్పడైనా సమస్యలు పరిష్కారమవుతాయో లేదోనని రైతులు చర్చించుకుంటున్నారు.**



ప్రజాశక్తి-బొబ్బిలి

రీసర్వేకు ముందు 1బి ఆధారంగా భూములకు రిజిస్ట్రేషన్ చేసేవారు. రీసర్వే తర్వాత 1బితో పాటు ఎల్‌పి నెంబర్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ప్రతి సర్వే నెంబర్‌కు ఒక ఎల్‌పి నెంబర్ కేటాయించాల్సి ఉన్నప్పటికీ చాలామంది రైతుల భూములకు జాయింట్ ఎల్‌పి నెంబర్లు ఇచ్చారు. రెండు నుంచి నాలుగైదు సర్వే నెంబర్లకు ఒకే నెంబర్ ఇవ్వడంతో 1బిలు రావడం లేదని, భూముల రిజిస్ట్రేషన్ జరగడం లేదని రైతన్నలు వాపోతున్నారు. జాయింట్ ఎల్‌పి నెంబర్ ఉన్న భూములకు సర్వే చేసి ప్రతి నెంబర్‌కు సింగిల్ ఎల్‌పి నెంబర్ కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

**భూమి క్రయ విక్రయాలకు ఆటంకాలు**

జాయింట్ సర్వే నెంబర్లు ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ అంగీకరించడం లేదు. జాయింట్ ఎల్‌పి నెంబర్లు ఉన్న భూములకు 1బి కూడా రావడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ అవ్వకపోవడంతో వైద్య ఖర్చులు, పెళ్లిళ్లకు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు చెపుతున్నారు.

**రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు**

రీసర్వేతో భూరికార్డులలో తప్పులు నమోదు కావడంతో భూరికార్డులను సరిచేసేందుకు రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. వ్యవసాయ పనులు మానుకుని రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రికార్డులు సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

**161 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి**

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ఏడు మండలాల్లో 273 రెవెన్యూ గ్రామాలు ఉండగా 161 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయగా 24 గ్రామాల్లో రీసర్వే అసంతృప్తిగా ఉంది. మిగిలిన 112 గ్రామాల్లో రీసర్వే పూర్తిగా ప్రారంభం కాలేదు.

**తప్పుల తడకగా భూ రికార్డులు**

రీసర్వే తర్వాత భూ రికార్డులు తప్పుల తడకలుగా మారాయి. భూ రికార్డుల్లో తప్పులు ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూ రికార్డుల్లో తప్పులు ఉండడంతో పంట రుణాలు కూడా అందడం లేదు. 1బిలు రాకపోవడంతో ఇ-క్రాప్ కూడా అవ్వలేదని, దీంతో తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోలేక వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

**రీసర్వే రద్దుకు డిమాండ్**

రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వస్తే రీసర్వే రద్దు చేస్తామని ఎన్నికల్లో ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చినప్పటికీ రీసర్వే రద్దు చేయలేదు. ప్రభుత్వం స్పందించి రీసర్వే రద్దు చేసి తమ భూ రికార్డులను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

## ప్రత్యేకాధికారుల నియామకం

**విజయనగరంకోట** : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి జిల్లాలో జరగనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గానికో ప్రత్యేక అధికారిని నియమించినట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి ఒక డిప్యూటీ కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తున్నట్లు వెల్లడించారు. ఆ నియోజకవర్గ పరిధిలో సదస్సులను పర్యవేక్షిస్తూ గ్రామసభల్లో వచ్చే వినతులపై ప్రజలు, రైతులకు సంతృప్తికరమైన రీతిలో వినతులు పరిష్కరించేలా ప్రత్యేక అధికారులు చర్యలు చేపడతారని పేర్కొన్నారు. రాజాం అసెంబ్లీ నియోజకవర్గానికి తోటపల్లి భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎల్.జోసెఫ్, బొబ్బిలికి ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి ఎం.నూకరాజు, మెరకముడిదాంకు ప్రకృతి విపత్తుల నిర్వహణ డిపిఎం ఎం.రాజేశ్వరి, గజపతినగరానికి ఎస్‌డిసి డి.ప్రమీలాగాంధీ, నెల్లిమర్లకు ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.సుధారాణి, విజయనగరం, ఎస్.కోట నియోజకవర్గాలకు తోటపల్లి భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణ ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారని వెల్లడించారు.

## ఈ సారైనా... పరిష్కారం దొరికేనా..?

**జామి** : మండల కేంద్రమైన జామి అగ్రహార భూముల సమస్య తాతల తండ్రుల కాలం నుంచి పరిష్కారం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి సాగులో ఉన్నా ఎటువంటి హక్కులూ లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. 2022 మే 25న అప్పటి తహశీల్దార్ పబ్లిక్ నోటిఫికేషన్ వేసి అన్నదాతల్లో ఆశలు రేపారు. ఈ ప్రక్రియ జరిగి సుమారుగా ఏడాది పైన కావస్తున్నా...అగ్రహారం భూములపై ఎటువంటి అడుగులూముందుకు పడలేదు. ఎన్నికల ప్రచారంలో సమస్యను పరిష్కరిస్తానని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హామీ ఇచ్చినప్పటికే, ఇంత వరకు దానిపై ఒక్క సారైనా స్పందించలేదు. ఒక్క జామి అగ్రహారం సమస్య ఒక్కటే కాదు. తాండ్రంగి ఇనాం భూముల సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. మండల కేంద్రంలో 7.5ఎకరాల ఇనాం చెరువు కబ్జాకు గురైంది. దీనిపై గత నెల 25న ఇరిగేషన్ అధికారులు తహశీల్దార్ కార్యాలయానికి లేఖ రాశారు. ఇరిగేషన్ చెరువు ఆక్రమణలు తొలగించి, చెరుకు హద్దులు గుర్తించాలని కోరారు. ఇలాంటి లేఖలు అనేక సార్లు రాశామని, పట్టించుకోవడం లేదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ సదస్సుల్లో అగ్రహారం, చెరువు ఆక్రమణలపై ఫిర్యాదులు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

# గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

## సివిల్ సప్లయ్ ఎమ్‌డి మంజీర్ జిలానీ



రైతులతో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ ఎమ్‌డి మంజీర్ జిలానీ

ప్రజాశక్తి-గుర్ల

రైతులకు గోనెసంచులు (పిపి బాగ్స్) అందుబాటులో ఉంచాలని సివిల్ సప్లయి ఎమ్‌డి మంజీర్ జిలానీ అన్నారు. గురువారం ఆయన తెట్టంగి రైతు సేవ కేంద్రం,భరత్ ఆగ్రో ఫుడ్స్ మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తెట్టంగి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు విషయమై సంబంధిత అధికారులను ఆడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సహాయకులను ప్రశ్నించి తేమ శాతం ఏవిధంగా తెలుసుకుంటారో అడిగారు. టిఎ తడబడడంతో గ్రామ వ్యవసాయ సహాయకులు తేమ శాతం గురించి వివరించారు. ట్రక్ షీట్స్ ఏవిధంగా జనరేట్ చేస్తున్నారు, మిల్లుకు రవాణా చేసేందుకు వాడే వాహనాలకు జిపిఎస్ ఉందా? ఎన్ని వాహనాలు అందుబాటులో ఉన్నాయని ప్రశ్నించారు. రైతుసేవా కేంద్రాల నుంచి తొమ్మిది వాహనాలు అందుబాటులో ఉన్నాయని సిబ్బంది తెలిపారు. దళారులకు రైతులు ధాన్యం అమ్మకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ధరను రైతులకు తెలియపర్చలన్నారు. అనంతరం పల్లిగండ్రేడు భరత్ ఆగ్రో ఫుడ్స్ మిల్లును తనిఖీ చేసారు. మిల్లు యజమాని ఉప్పలపాటి రాజేష్ వర్మ తో మాట్లాడి మిల్లు కెపాసిటీ, ఇంత వరకు ఎంత మేరకు ధాన్యం సేకరించారు, తేమ శాతంపై ఆరా తీశారు. ఎమ్‌డి వెంట జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, వ్యవసాయ శాఖ జెడి వి తారక రామారావు, డిఎస్‌ఒ మధుసూదన రావు, సివిల్ సప్లై డిఎం మీనా కుమారి, తహశీల్దార్ ఆదిలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా చర్యలు

- నేటి వరకు 56,592 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతులకు వెనువెంటనే చెల్లింపులు
- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రస్తుత ఖరీఫ్ సీజనులో జిల్లాలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లాలో నవంబరు 5 నుంచి ధాన్యం సేకరణ ప్రారంభించామని, డిసెంబరు 5 వరకు నెలరోజుల్లో 56,592 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. జిల్లాలో రైతుల నుంచి ధాన్యం సేకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ ఈ విషయాలు వెల్లడించారు. జిల్లాలో 369 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరను చెల్లించి ధాన్యం సేకరణ చేపడుతున్నామని వెల్లడించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి ఒక రోజులోనే చెల్లింపు జరుగుతోందన్నారు. తడిసిన ధాన్యంపై సమాచారం సేకరిస్తున్నట్టు చెప్పారు. ధాన్యం కోసి ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని రైతులకు అవగాహన కలుగజేయాలని సిఎం ఆదేశించారు. ధాన్యం సేకరణలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని తెలుసుకొని వెంటనే పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు కూడా పాల్గొన్నారు.

# కమిటీల ద్వారా ముందుకు..

## వివాదాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని కూటమి నేతల నిర్ణయం



జనసేన కార్యాలయంలో సమావేశమైన కూటమి నాయకులు

ప్రజాశక్తి- భోగాపురం

నెల్లిమర్ల నియోజకవర్గంలో కూటమినేతల్లో విభేదాలు తారాస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. అలాగే పల్లె పండగ పనులను టిడిపి నాయకులు అడ్డుకున్న వ్యవహారంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకొనే స్థాయికి వెళ్లారు. అయితే ఈ విభేదాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని కూటమి నేతలు నిర్ణయించుకున్నారు. త్వరలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఉండడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, పార్లమెంటరీ అధ్యక్షులు కిమిడి నాగార్జునతో పాటు జనసేన, టిడిపికి చెందిన ముఖ్య నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గతంలో ఇరువురి వల్ల ఏవో తప్పులు జరిగాయని, వాటిని పక్కన పెట్టి ముందుకు వెళ్లాలని అనుకున్నట్లు తెలిసింది. అందుకు వివాదాలకు దూరంగా ఉండి మండలాల వారీగా సమన్వయ కమిటీలను వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ కమిటీల ద్వారా ముందుకు వెళ్లాలని తీర్మానించుకున్నారు. ఇక పల్లె పండుగ పనులకు సంబంధించి అధిష్టానం ఏ విధంగా చెప్తే ఆ విధంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సమావేశంలో నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులంతా పాల్గొన్నారు.

# ఐసిడిఎస్‌లో ప్రక్షాళన

## విభేదాల నేపథ్యంలో సిడిపిఒ, ఎసిడిపిఒ బదిలీ

ప్రజాశక్తి-భోగాపురం




భోగాపురంలోని ఐసిడిఎస్ కార్యాలయం

భోగాపురం ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ, ఎసిడిపిఒ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో ఉన్నతాధికారులు ప్రక్షాళన చేశారు. ఇద్దరు అధికారులను ఇక్కడ నుంచి బదిలీ చేశారు. ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ ఎస్తేరురాణి, ఎసిడిపిఒ బి.తవిటినాయుడు మధ్య ఐదు నెలల కిందట వివాదం నెలకొంది. కార్యాలయ కారును చెరో 15 రోజులు చొప్పున ఇరువురు వాడుకోవాలని ఉత్తర్వులు ఉన్నా, తనకు ఇవ్వడం లేదని ఎసిడిపిఒ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎసిడిపిఒ కేంద్రాల తనిఖీ పేరుతో తమను ఇబ్బందులు పెడుతున్నారని 14 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పట్లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ఆర్‌జెడి చిన్మయి అప్పట్లో కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన 14 మంది కార్యకర్తలను పిలిపించి విచారించారు. సిడిపిఒపై ఫిర్యాదు చేసినందున.. ఆమె తనపై కార్యకర్తలతో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయించారని ఎసిడిపిఒ భావించారు. అనంతరం ఎసిడిపిఒకు భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన కొంతమంది కార్యకర్తలు మద్దతుగా నిలిచారు. ఎసిడిపిఒ తమను ఇబ్బంది పెట్టలేదంటూ సంతకాలు చేసి మరీ ఇచ్చారు. అప్పట్లో ఈ వివాదం ఉన్నతాధికారుల ఆదేశాలతో సద్దుమణిగింది.

**ఇద్దరూ బదిలీ**

ఈ ఇద్దరి మధ్య వివాదం ఇంకా కొనసాగుతుండటంతో ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఇద్దరిని బదిలీ చేస్తే కాని సమస్య పరిష్కారం కాదనే ఉద్దేశంతో వారిని బదిలీ చేశారు. సిడిపిఒ ఎస్తేరురాణిని పాడేరుకు బదిలీ చేశారు. ఎసిడిపిఒ నాయుడును విజయనగరం ఐసిడిఎస్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఇక్కడకు విజయనగరం అర్బన్ కార్యాలయం నుంచి ఎసిడిపిఒగా సత్యవతిని నియమించారు.




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## 21, 22న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 21,22, తేదీల్లో గజపతినగరంలో జరగనున్న ఎస్ ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు ప్రభుత్వ విద్యారంగంలో సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమవు తుందన్నారు. విద్యా రంగంలో వస్తున్న మార్పులు, ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా మహాసభల్లో చర్చిస్తామన్నారు. నేడు విద్యా దీవెన,వసతి దీవెన, అమ్మఒడి డబ్బులు నేటికీ చెల్లించలేదన్నారు. పేదలు చదువుకునే ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో సమస్యలతో కొట్టు మిట్టడుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యారంగంలో వస్తున్న మార్పులు, ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి కార్యాచరణ ప్రణాళికను మహాసభల్లో నిర్ణయాలు చేస్తామని తెలిపారు. మహాసభల సందర్భంగా 21న గజపతినగరంలో భారీ బహిరంగ సభ. అనంతరం ప్రతినిధుల సభ నిర్వహిస్తామన్నారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు. విలేకర్ల సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జె.రవికుమార్, చినబాబు, వెంకీ, రమేష్, శిరీష, రూప, మణికుమార్, సోమేష్, రాజు, కిరణ్, జగదీష్ పాల్గొన్నారు.

## నేడు మెగా పేరెంట్స్ మీట్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనెల 7న జిల్లా అంతటా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్స్ , టీచర్స్ మీట్ పండగలా జరగాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఇది తల్లి దండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం అని, పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం చర్చ జరిగే ఈ కార్యక్రమాల్లో ఎటువంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదని స్పష్టం చేసారు. గురువారం ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మండల ప్రత్యేకాధికారులు , ఎంఇఒలు తో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు, ఉపాధ్యాయులు స్నేహపూర్వక వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించాలని, ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కూడా మంత్రుల ఫోటోలు , అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధుల ఫోటోలు పెట్టకూడదని తెలిపారవు.

స్థానిక ప్రజా ప్రతినిధులను, శాసన సభ్యులను, శాసన మండలి , ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, రాజకీయ ప్రసంగాలు కాకుండా పిల్లల్ని ఉత్తేజ పరిచే మాటల్ని చెప్పాలని తెలిపారు. ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పై చర్చలు అనంతరం మధ్యాహ్న భోజనం అందరు కలిసి చేయాలని తెలిపారు. పూర్వ విద్యార్థులను ఆహ్వానించడం వంటి కార్యక్రమాలను హెచ్ఎంలు, ఎంఇఒలు చూడాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ 1796 పాఠశాలల్లో జరుగు ఈ కార్యక్రమాలకు అందరు తల్లి దండ్రులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత స్థాయి లో నిలిచిన పూర్వ విద్యార్థులు కూడా హాజరై పిల్లల్లో ఉత్తేజాన్ని నింపాలని ఆహ్వానించారు. వీడియో కాన్ఫరెన్సులో డిఇఒ మాణిక్యం నాయుడు, సిపిఒ బాలాజీ , మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి హత్యపై ఫ్యాప్టో ఆధ్వర్యాన నిరసనలు



బొబ్బిలి.. నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గరివిడి

కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థులు దాడి చేసి హతమార్చడానికి వ్యతిరేకంగా ఫ్యాప్టో ఆధ్వర్యాన గురువారం నిరసనలు చేపట్టారు. గరివిడి ఎంపిడిఒ కార్యాలయం వద్ద వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు డి.రాము మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మరణించి 24 గంటలు గడిచినా, ప్రభుత్వం గానీ, అధికారులు గానీ స్పందించకపోవడం ఉదాసీన వైఖరికి అద్దం పడుతోందన్నారు. కచ్చితంగా ప్రభుత్వం దీనిపై విధానపరమైన ప్రకటన చేసి, ఉపాధ్యాయుల, ఉద్యోగుల ప్రాణాలను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు అతిగారాబం, ఉపాధ్యాయులకు క్రమశిక్షణ నేర్పడంలో ప్రభుత్వాలు స్వేచ్ఛని ఇవ్వని కారణంగా విద్యార్థులలో క్రమశిక్షణా రాహిత్యం పెరిగిందన్నారు. ఆ పాఠశాల ఉన్న ప్రాంతంలో గంజాయి, గుట్కా సంస్కృతి ఉన్నట్లు తెలుస్తోందని, ఆ ప్రభావం ఆ పాఠశాలపై అధికంగా ఉందని చెప్పారు. ఏదేమైనా ఇటువంటి విష సంస్కృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒకు వినతి అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎం.రఘునాథరాజు, ఎ.సత్యశ్రీనివాస్, మీసాల వెంకటరమణ, బి.రాము, మీసాల రవికుమార్, కె.గోపాలకృష్ణ, సూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి** : ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ హత్యకు వ్యతిరేకంగా ఫ్యాప్టో ఆధ్వర్యాన బొబ్బిలిలో ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఉపవిద్యాశాఖ అధికారి కె.మోహన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వపరంగా ఉపాధ్యాయులకు పాఠశాలలో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎం.బలరాంనాయుడు, సిహెచ్ రామారావు, గంట సత్యనారాయణ, పోలినాయుడు, కళ్లెంపూడి ప్రసాద్, వెంకటరావు, చింత రమణ, తదితరులు పాల్గొన్నారు.

**రామభద్రపురం** : ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ హత్యకు వ్యతిరేకంగా రామభద్రపురం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జోగారావు, వేణుగోపాలరావు, ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కొత్తపల్లి ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, విద్యార్థుల్లో మార్పు కోసం తీసుకోవాల్సిన చర్యలను నిజాయతీగా చేపట్టాలని డిమాండ్‌చేశారు. గురుదేవోభవ అనే నినాదం నుంచి గురువులను రక్షించుకోవాలనే నినాదాలు చేసే స్థాయికి దిగజార్చే పరిస్థితులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఇఒ తిరుమల ప్రసాద్‌కు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గంగాధర్, సుధాకరరావు, వెంకటరావు, శ్రీనివాసరావు, సుదర్శనరావు, అప్పారావు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న వరిని పరిశీలించిన జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-గుర్ల



దెబ్బతిన్న వరిచేనును పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఇటీవల తుపాను ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న పంటలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మండలంలో గూడెం గ్రామంలో వరి పంట నష్టపోయిన పంట పొలాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రభుత్వ కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం రైతుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అధికారులు సక్రంగా పనిచేసి ప్రజలకు చేదోడు వాదోడుగా ఉండే వారని, కానీ ఇప్పుడు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని అన్నారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కెవి సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి సభ్యులు శీర అప్పలనాయుడు, ఎంపిపి ప్రతినిధి పి.సన్యాసినాయుడు, బంగారు నాయుడు కేశవరావు, తిరుపతిరావు వ్యవసాయ అధికారి తిరుపతిరావు పాల్గొన్నారు.

## వాలంటీర్ల మౌనదీక్ష

**విజయనగరంకోట** : ఆడబిడ్డలు కన్నీళ్లు పెట్టకుండా చూసుకుంటానని, వారిపై ఈగ కూడా వాలనివ్వనని చెప్పిన పవన్ కళ్యాణ్‌కు రాష్ట్రంలో 2 లక్షల మంది మహిళా వాలంటీర్ల ఆవేదన కనిపించలేదా? అని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రశ్నించారు. వాలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు చేయడంలో చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా గురువారం ఎపి గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) అధర్యంలో స్థానిక స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ గాంధీ విగ్రహం దగ్గర నల్ల రిబ్బన్లు నోటికి ధరించి మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మీడియాలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉగాది రోజున రాష్ట్రంలో వాలంటీర్లు అందరినీ కొనసాగిస్తామని హామీ ఇచ్చి ఏడునెలలైనా అమలు చేయలేదన్నారు. వాలంటీర్లందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనం పదివేల రూపాయలు ఇప్పించాలని కోరారు. గత 6 నెలలుగా బకాయి ఉన్న గౌరవ వేతనాన్ని విడుదల చేయించాలని, రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వాలంటీర్లను మన్నించి తిరిగి విదుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలి : సిపిఎం


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గౌతమ్ ఆదానితో గత ప్రభుత్వం అధికారికంగా చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని, స్మార్ట్ మీటర్లను టిడిపి కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం డి.బుచ్చయ్య అధ్యక్షతన జరిగిన శాఖ సమావేశంలో జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై వేయటాన్ని ఖండించారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ట్రూ అఫ్, సర్దుబాటు , సర్‌ఛార్జీలు పేరుతో ప్రజలపై వేలకోట్ల విద్యుత్ భారాలు వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదానితో గత ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలంతా అప్రమత్తమై స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం బలవంతంగా ముందుకెళితే మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.లక్ష్మి, జి.సింహాచలం, సిహెచ్ హరీష్, వెంకటమ్మ, కమల, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య కేంద్రానికి తాళాలు

**మూగజీవుల వైద్యానికి ఇబ్బందులు**

ప్రజాశక్తి-రేగిడి



పశువైద్య కేంద్రానికి తాళం వేయడంతో మూగజీవంతో వైద్యం కోసం ఎదురుచూస్తున్న వ్యక్తి

మండల కేంద్రంలో ఉన్న పశు వైద్య కేంద్రానికి గురువారం తాళాలు వేసి ఉండడంతో మూగజీవాల వైద్యానికి వచ్చిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఉదయం 9 గంటలకు తీయవలసిన పశువైద్య కేంద్రం పశువైద్యాధికారితో పాటు దిగు స్థాయి సిబ్బంది గైర్హాజరు తో మూగజీవాల వైద్యానికి వచ్చిన వెంకంపేట గ్రామానికి చెందిన ఎస్ సాయిరాం, ఈ ఆదినారాయణ గంటల తరబడి నిరీక్షించారు. మధ్యాహ్నం వరకు వైద్యాధికారితోపాటు సిబ్బంది రాకపోవడంతో నిరాశతో వెను తిరిగారు. పశువైద్యాధికారితో పాటుగా సిబ్బంది ప్రతిరోజు ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు.

# ఉచిత ఇసుకలో చోటా నాయకుల చేతివాటం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

**కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం మండలంలోని చోటా నాయకులకు కాసులు కురిపిస్తోంది. గోస్తనీ నది పరివాహక ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతున్న ఈ దందాలో వాటాల పంపకాల్లో వివాదం తలెత్తింది. దీంతో ఇసుక దందా కాస్తా బయటకు పొక్కింది. చివరికి ఇసుక రీచ్‌ను నిలిపేయాల్సిన పరిస్థితి తలెత్తింది.**

ప్రతి ఇసుక రీచ్‌కి పంచాయతీ కార్యదర్శిని ఇన్‌ఛార్జిగా నియమించాలి. ఇసుక కావాల్సిన వారు పంచాయతీ కార్యదర్శి యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రశీదు పొందిన తరువాత ఇసుక తీసుకువెళ్లాలి. ఇదీ నిబంధన. మండలంలో గోస్తనీ నది పరివాహక ప్రాంతాల్లో అవేవీ పాటించడం లేదు. కూటమి చోటా నాయకులు ప్రతిట్రాక్టర్ నుంచి ఇసుక లోడ్ చేసేందుకు తీసుకుంటున్న రూ.వెయ్యి కాకుండా మరో రూ.300 అదనంగా వసూలు చేస్తున్నారు. గతంలో గోపాలపల్లి ఇసుక రీచ్‌లో ట్రాక్టర్‌కు అప్పటివరకు ఉన్న రూ.300కు బదులు గ్రామంలో గుడి నిర్మాణానికంటూ ఒక్కసారిగా రూ.600కు పెంచారు. ఆ మొత్తం ఇస్తేనే రీచ్‌లోకి అనుమతిస్తామని ఆ గ్రామ నాయకుడు హుకుం జారీ

### వాటాల పంపకంలో వివాదంతో వెలుగులోకి

చేశాడు. దీంతో ట్రాక్టర్ యజమానులు రీచ్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో అధికారులు స్పందించి, చర్యలు ఉపక్రమించి, రీచ్ యథావిధిగా నడిచేలా చేశారు. ఆ ఘటన మరవక ముందే చామలాపల్లి ఇసుక రీచ్‌లో వసూలు చేసిన డబ్బులు వాటాల పంపకంలో నాయకుల మధ్య విభేదాలు తలెత్తాయి. కొంతమంది చోటా నాయకులు గోస్తనీ నదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా గోతులు తవ్వారు. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారుల తీరుపట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి కూడా ఇందులో వాటాలు వెళ్తున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తహశీల్దార్ అరుణ కుమారి ఇసుకరీచ్‌ను నిలిపేశారు.

### ఉపాధి కోల్పోయిన కూలీలు

చామలాపల్లి ఇసుక రీచ్‌లో తవ్వకాలు నిలిపేయడంతో అక్కడ ఇసుక లోడింగ్ చేసే కూలీలు ఉపాధి కోల్పోయారు. నాయకులు తమ పొట్ట మీద కొట్టారంటూ కూలీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ సమస్యను తహశీల్దార్ త్వరగా పరిష్కరించి, ఇసుక రీచ్‌ను యథాతథంగా కొనసాగించాలని



నదిలోకి వెళ్లకుండా గొయ్యి తవ్వి, అడ్డంగా పెట్టిన కర్రలు

వారు వేడుకొంటున్నారు.

### బెదిరింపులకు దిగుతున్నారు

ఇసుక రీచ్‌లో ఊట బావుల వద్ద సైతం ఇసుకను తరలించుకు పోతున్నారు. ఊటబావులకు 500 మీటర్లలోపు ఇసుక తవ్వడానికి అనుమతి లేదు. కానీ, రెవెన్యూ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. ఊట బావుల వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని చెప్పినందుకు నాపై బెదిరింపులకు దిగుతున్నారు. ట్రాక్టరుకు అదనంగా రూ.300 వసూలు చేయడాన్ని ప్రశ్నిస్తే, అధికారులకు, నాయకులకు ఇవ్వాలంటున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోతే జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తాను.

**- సూర్యారావు, చామలాపల్లి సర్పంచ్**

# ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య కోల్డ్‌వార్

## రోజురోజుకూ పెరుగుతున్న విభేదాలు

ప్రజాశక్తి - జామి



**ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గ్రూపుల మధ్య విభేదాలు పునరావృతం అవుతున్నాయన్న చర్చ సర్వత్రా సాగుతోంది. వీరి మధ్య అంతరం పెరిగితే గతం మాదిరిగా శృంగవరపుకోట నియోజకవర్గం గ్రూపు తగాదాలకు వేదిక కానుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు అనర్హత వేటును తప్పించుకుని మళ్లీ రంగప్రవేశం చేసిన తర్వాత కోల్డ్ వార్ కాస్త... ఇప్పుడిప్పుడే వేడి పెంచుకుంటోంది.**



గ్రామాల్లో సర్పంచుల అధికారాలను కూటమి ప్రభుత్వం వెండర్ విధానంతో దెబ్బ తీయడంతో గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే గ్రామ స్థాయి నాయకుల్లో అత్యధికులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అనుచరులు ఉండటంతో ఆయన బాహాటంగానే సర్పంచులకు అండగా నిలుస్తున్నారు. తాజాగా జామి సర్వసభ్య సమావేశంలోనూ రఘురాజు మాట్లాడుతూ, సర్పంచుల హక్కులు కాలరాస్తే ఊరుకోనని హెచ్చరించారు. ఇది ఒక భాగమైతే, ఇటీవల శృంగవరపుకోట మండలం కృష్ణమహంతిపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ ప్రారంభిస్తే, ఏ ఒక్క టిడిపి నాయకుడూ హాజరు కాలేదు. ఇదే కాదు.., ఎమ్మెల్సీ ఇటీవల ఏ కార్యక్రమంలో పాల్గొన్నా టిడిపి శ్రేణులు కనిపించడం లేదు. మరోవైపు తెలుగు తమ్ముళ్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిపై ఫైర్ అవుతున్నట్లు సమాచారం. పార్టీ కష్టకాలంలో జెండాలు మోసిన తమకు గౌరవం దక్కడం లేదని, శృంగవరపుకోట మండలంలో ఏ కార్యక్రమం జరిగినా ఎమ్మెల్సీ మనుషులే వేదికపై కూర్చుంటున్నారని నిలదీసినట్లు సమాచారం. ఇలా ఏ ఒక్క విషయంలోనూ గతం మాదిరిగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గ్రూపుల మధ్య పొసగడం లేదన్న చర్చ సాగుతోంది.

వాస్తవానికి కోళ్ల లలితకుమారి గెలుపులో ఎమ్మెల్సీ రఘురాజు పాత్ర ఎక్కువగానే ఉందని ప్రచారం జరిగింది. వైసిపిలో ఉన్నప్పటికీ తన సతీమణిని టిడిపిలోకి పంపడం ద్వారా ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేశారు. ఒక దశలో కోళ్ల ఓడిపోతున్నారన్న ప్రచారంతో చాలా గ్రామాల్లో వైసిపి నాయకులను మార్చి, ఆమె గెలుపునకు మార్గం సుగమం చేయడంలో పరోక్షంగా రఘురాజు కృషి ఉందన్న ప్రచారం సాగింది. కానీ రఘురాజు గ్రూపును పక్కన పెట్టి, టిడిపి నాయకులకే ప్రాధాన్యత ఇవ్వడం ఎమ్మెల్సీ అనుచరులకు మింగుడు పడటం లేదు. మరో వైపు ఎమ్మెల్యే అన్ని శాఖల్లోనూ తన మనుషులకు చోటు దక్కించుకున్న తీరు.. ఎమ్మెల్సీ గ్రూపునకు కంటగింపుగా మారిందని చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే గతం మాదిరిగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గ్రూపుల మధ్య విభేదాలకు కారణంగా మారింది. దీని తీవ్రత పెరిగితే, కోటలో కోల్డ్ వార్ కాస్త హాట్ వార్‌గా మారే అవకాశం ఉందని అంచనా.

## రైల్వే టికెట్లకు డిజిటల్ చెల్లింపులు ఆపాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రైల్వే టికెట్లకు డిజిటల్ చెల్లింపులు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కన్వీనర్ ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వేను ప్రయివేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అందులో భాగంగా టికెట్ కౌంటర్లలో డిజిటల్ పేమెంట్ చేస్తేనే టికెట్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడం అన్యాయమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు స్మార్ట్ ఫోన్లు వాడే పరిస్థితి లేదని, వారు ఎలా డిజిటల్ పేమెంట్ చేస్తారని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో వారంతా రైలు ప్రయాణానికి దూరం అవుతారని చెప్పారు.

## ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇగా అలేఖ్య

ప్రజాశక్తి-భోగాపురం

గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఎ.అలేఖ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె విజయనగరం డివిజనల్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎఇగా పనిచేసిన హేమంత్ కుమార్‌కు ఇదివరకే పూసపాటిరేగ మండలానికి బదిలీ అయింది.

## కెజిబివిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-రాజాం

రాజాం కెజిబివిని జిల్లా సిఎంఒ వి.ఆదినారాయణ, ఎపిఒ గోపీచంద్.. గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు విద్యార్థినులకు అభ్యసన సామర్థ్యం పెంపొందించడానికి ప్రత్యేక ప్రణాళికలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు అన్ని సబ్జెక్టులపై పలు పరీక్షలను నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గతేడాది పదోతరగతిలో 96 శాతం, ఇంటర్‌లో 92 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది వంద శాతం ఫలితాలు వచ్చేలా బోధన సాగించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.సావిత్రి పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-వేపాడ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ ఆదేశించారు. గురువారం మండలంలోని కుంపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డుల పరిశీలన, ప్రస్తుతం జరుగుతున్న సర్వేపై ఆరాతీశారు. విధి నిర్వహణలో జాప్యం వద్దని, కార్యాలయ పని వేళలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. గ్రామస్తుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ప్రజలకు అందించే సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఆర్ జెఇ ఆలీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సృజనాత్మకత పెంచేందుకు కృషి

ప్రజాశక్తి-రామభద్రపురం

అంగన్వాడీ ప్రీస్కూల్లో చేరిన చిన్నారుల్లో సృజనాత్మకత పెంచడానికి అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలని బాడంగి ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మీ సూచించారు. గురువారం కొండకెంగువ సెంటర్-2లో ఇసిసిఇ దినోత్సవం నిర్వహించారు. అనంతరం పిల్లలతో ఆటల, కథల సంభాషణ, కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కృష్ణకుమారి, కార్యకర్త హేమ పాల్గొన్నారు.

**బొబ్బిలి :** ఐదేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి కోరారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం ఇసిసిఇ దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు నేర్చుకున్న విద్యను, ఆటలను తల్లుల ముందు ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## 'సీతం'లో పేటెంట్ ప్రచురణపై సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పేటెంట్స్ ప్రచురణ, పేటెంట్ గ్రాంట్ పై అధ్యాపకులకు గురువారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఒడిషా నుండి డీన్ డాక్టర్ ప్రఫుల్ల కుమార్ పాండా విచ్చేసారు.ఢిల్లీ నుండి విచ్చేసిన పేటెంట్ అటార్నీ సంప్రతి బసంత్, అధ్యాపకులతో పేటెంట్స్ ప్రచురణ, హక్కులు గురించి పరస్పరం చర్చించారు. పేటెంట్లు ఆర్థికంగా సమర్థవంతమైన పరిశోధన అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ మూర్తి, కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశి భూషణ రావు, వైస్ ప్రిన్సిపాల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

## సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-రాజాం



పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

మండలంలోని బొద్దాం, సోపేరు, గార చీపురుపల్లి సచివాలయాలను ఎంపిడిఒ శ్రీనివాసరావు సందర్శించారు. హౌస్‌హోల్డ్, ఎంఎస్ఎంఇ సర్వేలను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లను పరిశీలించారు. పల్లె పండుగ పనులు కూడా పరిశీలించారు. సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపిడిఒ తెలిపారు. సిబ్బంది సమయపాలన సక్రమంగా పాటించాలని ఆయన సూచించారు.

## 2.0 కొత్త ప్రోగ్రాం సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-రేగిడి

2.0 కొత్త ప్రోగ్రాం సర్వే ప్రారంభించామని హౌసింగ్ డిఇ ఎన్.జె. రత్నాకర్ తెలిపారు. రేగిడి మండలం హౌసింగ్ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ 2.0 కొత్త ప్రోగ్రాం సర్వే ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. నూతన గృహం నిర్మించుకోనున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు ఇస్తుందని కేంద్ర ప్రభుత్వం లక్షా యాభై వేలు ఇస్తుందని తెలిపారు. ఈ వివరాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 అనే యాప్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. భార్యాభర్తలు ఇద్దరూ ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంటు, రేషన్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్, కేస్ట్ సర్టిఫికెట్, ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్, కచ్చితంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ బలగ శివ, డిఇ చీమల నారాయణరావు ఉన్నారు.

## వీధి కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో కుక్కలను అదుపులోకి తీసుకొని యాంటీ రాబిస్ టీకా, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. గత కొన్నాళ్ళుగా నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదుల మేరకు ఆయన స్పందించారు. ప్రత్యేక బృందాన్ని రప్పించి వారి ద్వారా వీధులలో ఉన్న వీధి కుక్కలను అదుపులోకి తీసుకుంటున్నారు. వాటిని కొత్తపేటలో ఉన్న డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్ కు తరలించి అక్కడ సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. కుక్కల నుండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ వీధులలో చిన్న పిల్లలను ఒంటరిగా విడిచి పెట్టవద్దని, దీనివల్ల కుక్కల బారిన పడే ప్రమాదం ఉంటుందని కమిషనర్ తెలిపారు.

# భూసమస్యల పరిష్కారానికే సదస్సులు



బొబ్బిలిరూరల్.. మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం చేపడుతోందని ఆర్‌డిఒ రామ్మోహనరావు తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో తెర్లాం, రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి మండలాల తహశీల్దార్లు, విఆర్‌ఒలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాల వారీగా నిర్వహించే సదస్సుల్లో రైతులు భూ సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. వీటిని రెవెన్యూ అధికారులు తీసుకొని ప్రభుత్వ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, బొబ్బిలి తహశీల్దార్ ఎం.శ్రీను, ఎంపిడిఒ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వేపాడ :** మండలంలో శుక్రవారం నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాములమ్మ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సదస్సుల నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ డి.సన్యాసినాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

**తెర్లాం :** రెవెన్యూ సదస్సులపై అఖిలపక్ష సమావేశాన్ని తహశీల్దార్ హేమంత్‌కుమార్ నిర్వహించారు. మ్యుటేషన్, సవరణ, తదితర సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ సదస్సులకు సహకరించాలని కోరారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు ఎన్.వెంకట్ నాయుడు, యుగంధర్, సర్పంచ్ జె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**రామభద్రపురం :** ఈనెల 6 నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులు పారదర్శకంగా నిర్వహించాలని మండల స్పెషలాఫీసర్ ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ ఆకుల సులోచనారాణి మాట్లాడుతూ ఈ సదస్సుల్లో వచ్చిన సమస్యలను అక్కడికక్కడే ఆన్‌లైన్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసి, విఆర్‌ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

**విజయనగరం టౌన్ :** రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించేందుకు విఆర్‌ఒలు ప్రత్యేక కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో తహశీల్దార్ కూర్మనాథ్ తో కలిసి విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. రేపటి నుండి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులు విజయవంతం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

## గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-దత్తిరాజేరు



ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

బకాయి జీతాలు చెల్లించాలని, గత ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి జీతాలు బకాయిలు ఉంచడం సరికాదన్నారు. మండలంలో మూడు నుంచి 19 నెలల వరకు జీతాలు చెల్లించాల్సి ఉందని, ఇన్ని నెలలు బకాయి జీతాలతో ఎవరైనా పని చేస్తున్నారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాగైతే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని నిలదీశారు. ఇప్పటికైనా బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, గత ప్రభుత్వం ఇచ్చిన జిఒ 680 ప్రకారం రూ.10 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. అనంతరం ఎంపిడిఒ విజయప్రసాద్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల కార్యదర్శి కె.నూకరాజు, మూర్తి, కృష్ణ, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.

## పచ్చిమేతతో పాల దిగుబడి



గడ్డి విత్తనాలను అందజేస్తున్న జెడి రమణ, తహశీల్దార్ అరుణకుమారి

ప్రజాశక్తి-శృంగవరపు కోట

పచ్చి మేత వల్ల పశువులకు పాల దిగుబడి, సంతానోత్పత్తి పెరుగుతాయని పశువర్ధక శాఖ జెడి రమణ తెలిపారు. మండలంలోని ధర్మవరం పంచాయతీ సన్యాసపేటలో గురువారం ఎఎఫ్‌పిఆర్‌ఒ సంస్థ, పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో పచ్చి మేత ప్రాముఖ్యత, అభివృద్ధిపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీలో పశు గ్రాసం అభివృద్ధి కోసం రైతుకు రూ.30 వేలు వరకు సహాయం చేస్తుందన్నారు. ఎఎఫ్‌పిఆర్‌ఒ సంస్థ చేపడుతున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహశీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా పాడి పరిశ్రమకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అనంతరం 50 మంది రైతులకు సుగర్ గ్రేజ్ గడ్డి విత్తనాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎడి చలపతిరావు, ఎఎఫ్‌పిఆర్‌ఒ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ చుక్క శ్రీరాములు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నేలను సారవంతం చేద్దాం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ప్రపంచ జీవకోటికి ప్రాణాధారమైన నేలను కాపాడుకొని సారవంతం చేయాల్సిన అవసరం ప్రతిఒక్కరిపైనా ఉందని వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి, నేలల ప్రాముఖ్యత కోసం రైతులకు విద్యార్థులకు వివిధ రైతు సేవా కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైతులతో, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నేల ఆవశ్యకతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

**కాలంరాజుపేటలో ప్రపంచ నేల దినోత్సవం**

**గజపతినగరం :** మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన



గజపతినగరం.. మట్టి పరీక్షల కార్డులను అందజేస్తున్న వ్యవసాయాధికారులు

కేంద్రం శాస్త్రవేత్త అనురాధ, భూసార పరీక్ష కేంద్రం ఎడి భానులత, వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా వనరుల కేంద్రం ఎఒ గోవిందమ్మ, భానులత మాట్లాడుతూ నేల దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. అనంతరం రైతులకు మట్టి ఆరోగ్య కార్డులను అందించారు. కార్యక్రమంలో ఎంఎఒ సిహెచ్ ధనలక్ష్మి, సర్పంచ్ ఈశ్వర్‌రావు, విఎఎ మస్తాన్ వలి పాల్గొన్నారు.

## నేడు శ్రీరామ పాదుక పట్టాభిషేకం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాల మైదానంలో శుక్రవారం శ్రీరామ పాదుక పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. రాజా కళాశాల మైదానంలో ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ పాదుక పట్టాభిషేకానికి చినజీయర్ స్వామి హాజరవుతారని చెప్పారు. శుక్రవారం సాయంత్రం 4గంటలకు కోట నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 19 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని, వారికి పూజ సామగ్రి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## రెస్టారెంట్లపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో ఉన్న రెస్టారెంట్లు, హోటళ్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దృష్టి సారించాలని సిపిఐ కోట అప్పన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. దాబాలు, రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులు ఇష్టానుసారంగా రేట్లు నిర్ణయించి, ఆహారంలో నాణ్యత పాటించడం లేదని ఆరోపించారు. నిల్వ ఉన్న మాంసం కూడా విక్రయిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సిపిఐ పట్టణ నాయకులు వై.బాబ్జి. పి.కృష్ణ పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరంలోని తోటపాలెంలో నాలుగు ఇళ్లలో ఆగస్టులో దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంతరాష్ట్ర దొంగను గురువారం అరెస్టు చేసి, అతని నుంచి 400 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేసినట్లుగా వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. తోటపాలెం వైఎస్ఆర్ కాలనీలో ఆగస్టు 20న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడినట్లుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుల్లో సాంకేతిక ఆధారాలు ఆధారంగా నేరానికి పాల్పడిన వారు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐదా (ఈదు బఘెల్) ఈనెల 4న రాత్రి విజయనగరంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టారు. తన గ్యాంగుతో మధ్యప్రదేశ్ నుంచి వచ్చి తోటపాలెం ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడినట్లుగా అంగీకరించారని వన్ టౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడి నుంచి 400 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేసి, రిమాండుకు తరలించినట్లు వన్‌టౌన్ సిఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన ఎస్ఐ సురేంద్ర నాయుడు, హెచ్.సి.లు అచ్చిరాజు, శంకరరావు, ఇమ్రాన్ ఖాన్, కానిస్టేబుళ్ల శ్రీను, మణికంఠలను సిఐలు శ్రీనివాస్, సత్యనారాయణ అభినందించారు.

## ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి



ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు, సిఐటియు నాయకులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎండిఎం కార్మికులు గురువారం పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల వద్ద ధర్నా చేశారు. అనంతరం ఎంఇఒకు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు భారీ స్థాయిలో పెరుగుతున్నా, కేంద్ర ప్రభుత్వం మెనూ ఛార్జీ 31 పైసలు పెంచడం దారుణమన్నారు. ప్రతి విద్యార్థికి మెనూ ఛార్జి రూ.20 ఇవ్వాలని, కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. టీచర్స్, పేరెంట్స్ సమావేశాల్లో పెట్టే భోజనానికి ఒక్కొక్కరికి రూ.30 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు వి.రామలక్ష్మి, దుప్పాడ ఆదిలక్ష్మి, సిఐటియు మండల నాయకులు ఎస్.గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలకు ప్రాధాన్యతతో రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-విజయనగరం కోట



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు కనకల రాంబాబు

గ్రామంలో శ్మశాన వాటికలకు ప్రాధాన్యతగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు పినవేమలి టిడిపి నాయకులు కనకల రాంబాబు తెలిపారు. బుధవారం తనను కలిసిన ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం శ్మశాన వాటికలకు రోడ్లు నిర్మించకుండా వదిలేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలల వ్యవధిలోనే రోడ్లకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి గ్రామాల్లో ఉపాధి హామీ నిధుల ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగా పినవేమలి గ్రామానికి రూ.56లక్షలు మంజూరైందన్నారు. ఆ నిధులతో ప్రధానమైన పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఎస్‌సిలకు సంబంధించిన శ్మశాన వాటికలకు రూ.19.60లక్షలతో 499 మీటర్ల పొడవు గల సిసి రోడ్డు, 10 అడుగుల వెడల్పుతో డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. బిసిలకు చెందిన మరో శ్మశాన వాటికకు 430 మీటర్లు పొడవు, పది అడుగులు వెడల్పుతో రూ.15 లక్షలతో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా 300 మీటర్ల పొడవు గల డ్రైనేజీని ఇరువైపులా రూ.15 లక్షలు వెచ్చించి నిర్మిస్తున్నట్లు తెలిపారు. రహదారుల సమస్య పరిష్కారం కావడం పట్ల గ్రామస్తులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపుకోట



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట పట్టణంలోని సీతంపేటలో రూ.5 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. డ్రెయిన్లు, తాగునీరు, తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, కాళీ, బీశెట్టి అరుణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇందుకూరి శ్రీనురాజు, కాపుగంటి వాసు, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. రహదారుల పక్కన చిన్న చిన్న టిఫిన్ దుకాణాలు పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచడాన్ని చూసి మందలించారు. మరోసారి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రహదారులపై చెత్తాచెదారాలను వేస్తే అపరాధ రుసుం విధిస్తామన్నారు. ఎంఎస్ఎంఇ సర్వేను పరిశీలించారు.

**డివిజన్ పర్యటనలో అసిస్టెంట్ కమిషనర్**

18వ డివిజన్‌లో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు పర్యటించారు. హుకుంపేటలో పలు సమస్యలను గుర్తించారు. కొన్నిచోట్ల తాగునీరు సక్రమంగా సరఫరా జరగటం లేదని ప్రజలు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని, మధ్యాహ్నం భోజన పథకం అమలును పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ మీసాల రమాదేవి, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.